ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 03.03.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు ఘనంగా హోళి పండుగ సంబరాలను జరుపుకుంటున్నారు. పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

2. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తక్షణమే పూర్తిస్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ మేరక బహిరంగ లేఖ రాశారు.

3. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇవాళ జిల్లా కలెక్టర్ల కీలక సమావేశం కొనసాగుతోంది.

4. సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలను మూసివేశారు. గ్రహణ అనంతరం సంప్రోక్షణతో ఆలయాలను అర్చకులు తెరవనున్నారు.

------------------------

**హోలీ**

హోలీ పండుగను పురస్కరించుకుని తెలంగాణతో పాటు హైదరాబాద్  మార్కెట్లు రంగులతో కళకళలాడుతున్నాయి. భక్తిశ్రద్ధలు, ఉత్సాహంతో వేడుకలకు సిద్ధమవుతున్న ప్రజల్లో ఈ ఏడాది పండుగ తేదీలపై కొంత గందరగోళం నెలకొంది. క్యాలెండర్లలోని వ్యత్యాసాలు, ప్రభుత్వ సెలవుల ప్రకటనల నేపథ్యంలో పండుగ ఎప్పుడనేది స్పష్టత లేదని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు మార్కెట్లో రంగుల ధరలు గతేడాదితో పోలిస్తే అందుబాటులోనే

ఉన్నాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఉదయం పూజలు ముగించుకున్నాకే పిల్లలతో కలిసి రంగులు ఆడుకోవడం తమ ఆచారమని నగరవాసులు వెల్లడిస్తున్నారు.

డెస్క్

----------------------------

**శుభాకాంక్షలు**

తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోళీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతి పండుగగా పిలుచుకునే హోళీని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. ప్రేమ, ఆప్యాయతలకు మరియు శాంతి సౌభ్రాతృత్వానికి హోళీ ప్రతీక అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ప్రజలందరూ కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఈ వేడుకను జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రసాయన రంగులకు బదులుగా, సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించి సాంప్రదాయ పద్ధతుల్లో పండుగను నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.

డెస్క్

----------------------------

**రామచందర్ రావు - హోళి**

హోళీ పండుగ సందర్బంగా ఈ రోజు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో యువతతో కలిసి బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఘనంగా జరుపుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో సానుకూల చైతన్యాన్ని, సామూహిక భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ హోళీ శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి పొన్నం ప్రభాకర్ పండుగ హోళీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోళీ పండుగ మన సంస్కృతిలో స్నేహం, సౌహార్దం, ఆనందానికి ప్రతీక. రంగులలా మన జీవితాలు సంతోషాలతో నిండాలని, ప్రతి ఇంట్లో ఐక్యత, శాంతి, సుఖసమృద్ధులు నెలకొనాలని ఆకాంక్షించారు.

డెస్క్

-----------------------------------

**హోళి వేడుకలు - సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా హోలీ వేడుకలు అంబరాన్ని అంటాయి. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు పల్లెల్లో ప్రజలు రంగులు చల్లుకుంటూ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ఒకరికొకరు రంగులు పూసుకుంటూ ఆనందంలో మునిగితేలారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎస్పీ మహేష్ బి గీతే, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని నృత్యాలు చేశారు. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల శాస్త్రోక్తంగా కామదహన కార్యక్రమంతో పాటు ఉత్సాహంగా ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

---------------------

**హోళి**

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా హోలీ పండుగ వేడుకలను ఈరోజు ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగ వేడుకల్లో చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరికి సంబరాల్లో మునిగిపోయారు. జిల్లాలో నిర్వహించిన హోలీ వేడుకల్లో ప్రజలు ఎక్కువగా సహజ రంగులకు ప్రాధాన్యత ఇచ్చారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

----------------------

**నల్గొండ**

నల్గొండ జిల్లాలో హోలీ వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకుంటున్నారు.. గ్రామాలు, పట్టణాలలో నిన్న రాత్రి కామదహనం చేసి ఈ ఉదయం నుంచి హోలీ వేడుకలలో పాల్గొంటున్నారు.. నల్లగొండ అదనపు ఎస్పీ రమేష్ డీఎస్పీ శివరాం రెడ్డిలు సిబ్బందితో కలిసి రంగులు చల్లుకొని హోళీ వేడుకలు జరుపుకున్నారు... స్థానిక చిన

వెంకటరెడ్డి ఫంక్షన్ హాల్ లో యోగా శిక్షకురాలు దేవిక ఆధ్వర్యంలో యోగాభ్యాసకులు వేడుకలు జరుపుకున్నారు.

**పీటీసీ - నల్గొండ**

---------------------------

**శ్వేతపత్రం**

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తక్షణమే పూర్తిస్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇవాళ కిషన్ రెడ్డి ముఖ్యమంత్రికి ఒక బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ఖజానా ఖాళీగా ఉందంటూ సాకులు చెబుతోందని విమర్శించారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటా, రహదారులు, రైల్వేలు, వివిధ పథకాల రూపంలో సుమారు 12 లక్షల కోట్ల రూపాయలను రాష్ట్రానికి అందించిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్రంలో జీతాలు, రైతు భరోసా, వడ్డీల చెల్లింపులకు కూడా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని కేంద్ర మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం అందిస్తున్న వడ్డీ లేని రుణాలపైనే రాష్ట్ర ప్రాజెక్టులు ఆధారపడటం తెలంగాణ ఆర్థిక సంక్షోభానికి అద్దం పడుతోందని పేర్కొన్నారు. మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల కంటే ముందే వాస్తవ పరిస్థితులను ప్రజల ముందు ఉంచాలని కిషన్ రెడ్డి కోరారు.

**డెస్క్**

-------------------------------------

**కలెక్టర్ల కీలక సమావేశం**

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇవాళ జిల్లా కలెక్టర్ల కీలక సమావేశం జరుగుతోంది. ఉదయం ప్రారంభమైన ఈ సమావేశం సాయంత్రం 6 గంటల వరకు సుదీర్ఘంగా కొనసాగుతుంది. ఈ సదస్సులో రాష్ట్ర అభివృద్ధి, పాలనపై కీలక చర్చలు జరుగుతున్నాయి. ఈ సమావేశాన్ని ప్రభుత్వం రెండు విభాగాలుగా విభజించింది. ఉదయం

సెషన్‌లో జనగణన ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం సెషన్‌లో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'పై విస్తృతంగా చర్చించనున్నారు. ముఖ్యంగా ఈ నెల 6వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న 99 రోజుల ప్రత్యేక కార్యాచరణపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల అమలు తీరు, ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, డీజీపీతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని పాలనాపరమైన అంశాలపై సూచనలు చేయనున్నారు.

డెస్క్

---------------------------------

**హరీష్ రావు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అక్రమ మైనింగ్, రియల్ ఎస్టేట్ దందాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజేంద్రనగర్ మానస హిల్స్ ప్రాంతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన 'రాఘువ కన్‌స్ట్రక్షన్స్' ఎలాంటి అనుమతులు లేకుండా కొండలను పిండి చేస్తూ అక్రమ క్వారీ నిర్వహిస్తోందని హరీష్ రావు ఆరోపించారు. పర్యావరణ, మైనింగ్ అనుమతులు లేకున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అల్లుడి అనుయాయులకు ఓపెన్ బిడ్డింగ్ లేకుండా 17 ఎకరాల ప్రభుత్వ భూమిని కట్టబెట్టారని హరీష్ రావు ఆరోపించారు. పేదల ఇళ్లను కూల్చే హైడ్రాకు మంత్రుల అక్రమ క్వారీలు, భూకబ్జాలు ఎందుకు కనిపించడం లేదని నిలదీశారు.

డెస్క్

------------------------

**బుద్ధవనం**

నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో జరిగిన మూడవ బుద్ధ ధమ్మ యాత్ర ముగింపు సభకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి ముఖ్యఅతిథులుగా

హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ, బుద్ధవనాన్ని పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్థాయి వారసత్వ కేంద్రంగా, విశ్వశాంతి నిలయంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. బుద్ధుని బోధనలను 'ప్రభాత్ భేరి' కార్యక్రమం ద్వారా కళారూపాలు, సోషల్ మీడియా మాధ్యమాలతో గ్రామగ్రామానికి తీసుకెళ్తామని వెల్లడించారు.

**S/B – JUPALLY KRISHNARAO**

మంత్రి వివేక్ వెంకటస్వామి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**డెస్క్**

------------------------------

**సంపూర్ణ చంద్రగ్రహణం**

సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి, వేములవాడ రాజన్న దేవాలయం, హనుమకొండ వేయి స్తంభాల గుడి, భద్రకాళి ఆలయం, స్వయంభూ సిద్ధేశ్వర ఆలయాలు, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాలను ఈ రోజు ఉదయం అర్చకులు మూసివేశారు. శాస్త్రోక్త నిబంధనల ప్రకారం గ్రహణ సమయానికి ముందే నిత్య కైంకర్యాలను పూర్తి చేసి గర్భాలయ ద్వారాలను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. గ్రహణం వీడే వరకు భక్తులకు స్వామివారి దర్శనంతో పాటు అన్ని రకాల ఆర్జిత సేవలు, అన్నప్రసాద వితరణను రద్దు చేశారు. గ్రహణం ముగిసిన అనంతరం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించి, రేపు ఉదయం నుంచి భక్తులను తిరిగి దర్శనాలకు అనుమతించనున్నారు. భక్తులు ఈ మార్పులను గమనించి తమ ప్రయాణాలను నిర్ణయించుకోవాలని ఆలయ ఈవో సూచించారు.

**పీటీసీలు**

----------------------------